క్లుప్తంగా

బస్టాండ్‌లో ఎస్‌బీఐ ఏటీఎం సేవలు ప్రారంభం



నెహ్రూనగర్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ఎస్‌బీఐ అన్ని వేళలా కృషి చేస్తుందని డీజీఎం(ఏట) దినేష్ గులాటీ తెలియజేశారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఆయన ఏటీఎం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులు, ఉద్యోగులు బస్టాండ్‌లో నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వీలుగా రెండు మిషన్లు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం(ఏటీసీ) రెహమాన్, ఏజీఎం(నెట్‌వర్క్‌– 2) రాధాకృష్ణమూర్తి, ఆర్‌ఎం ఏ. తారకేశ్వరరావు, మేనేజర్ వి. మాధవి, ఏటీఎం చానల్ మేనేజర్ మేడిద బాబూరావు పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెట్ శేషయ్యకు సన్మానం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జీవితాంతం క్రీడలు, శిక్షణకు జీవితాన్ని అంకితం చేసిన నగరానికి చెందిన వెటరన్ అథ్లెట్ జి.శేషయ్యను స్టార్ అథ్లెట్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. అనేక మంది జాతీయ, అంతర్జాతీయ అథ్లెట్స్‌ను తీర్చిదిద్దిన ఘనత శేషయ్యదని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా శేషయ్యకు అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ మహేష్ బాబు, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు అభినందనలు తెలిపారు.

ఉచితంగా ఓపీ సేవలు

గుంటూరు మెడికల్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు హోప్‌విన్ హాస్పిటల్స్‌లో ఉచితంగా ఓపీ వైద్య సేవలు అందిస్తున్నట్లు చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా తెలిపారు. రక్త పరీక్షల్లో సైతం 50 శాతం రాయితీ అందిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులోని తమ ఆసుపత్రిలో అందిస్తున్న ఉచిత ఓపీ వైద్య సేవల్ని ప్రజలు వినియోగించుకోవాలని హాస్పిటల్ వైస్ చైర్మన్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ కోరారు.

ముగిసిన కోదండ రాముని ఉత్సవాలు



పాత గుంటూరు: కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు విశేషంగా పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామివారి పూజల్లో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, చుక్కపల్లి రమేష్ పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం స్వామి పవళింపుసేవ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, 43వ డివిజన్ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, సభ్యులు కిలారి నాగేశ్వరరావు, పి. శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పేదల ఆరోగ్యానికి ‘స్పెషాలిటీ’ భరోసా

- ఇంటికి కూతవేటు దూరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్పెషాలిటీ వైద్యులు
- పేదలకు ఉచితంగా వైద్యసేవలు
- గర్భిణులకు స్కానింగ్, వైద్య సలహాలు
- బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక జబ్బులకు మందులు, పరీక్షలు కూడా ఉచితమే..



ఓపీకి చికిత్స కోసం వచ్చిన రోగులు

గుంటూరు మెడికల్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఉచితంగా స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో అంతంత మాత్రమే లభించేవి. నేడు గ్రామీణులు, పట్టణాల్లో నిరుపేదలు ఉండే ప్రాంతాలకు కూతవేటు దూరంలో ఉండే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషాలిటీ వైద్య సేవలు పూర్తి ఉచితంగా అందిస్తూ పేదల ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. కోవిడ్ సమయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డాక్టర్ మొదలుకొని నాలుగో తరగతి ఉద్యోగి వరకు అన్ని రకాల కేడర్ పోస్టులను మంజూరు చేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల్ని బలోపేతం చేయడమే గాకుండా పేదలకు వారి ఊరిలోనే స్పెషాలిటీ వైద్యసేవల్ని ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.స్పెషాలిటీ వైద్యులు రావడంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందేవారి సంఖ్య గతంలో కంటే నేడు రెట్టింపు అయ్యింది.



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కానింగ్ పరికరం



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

స్పెషాలిటీ వైద్యులు వీరే..

టీచింగ్ హాస్పిటల్స్ ఉండే స్పెషాలిటీ వైద్యుల్ని గ్రామీణ స్థాయిలో ఉండే ఆరోగ్య కేంద్రాల్లో కూడా రాష్ట్రప్రభుత్వం నియమించింది. చిన్నపిల్లలు, చర్మ వ్యాధి, ఎముకలు, కీళ్ల వ్యాధులు, ఊపిరితిత్తులు, జనరల్ సర్జన్, ప్రసూతి, గర్భకోశ వ్యాధులు, జనరల్ మెడిసిన్, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల్ని ప్రభుత్వం నియమించి వైద్య ఆరోగ్యశాఖలో నూతన అధ్యయనానికి తెరలేపింది. సోమవారం నుంచి శనివారం వరకు ఒక్కో రోజు ఒక్కో స్పెషాలిటీ వైద్యుడు పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీల్లో నిర్దేశిత పని వేళల్లో వైద్యసేవలు అందిస్తున్నారు.

పేదలకు ఎంతో ప్రయోజనం



ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో నేడు గ్రామీణులకు ఇంటికి సమీపంలోనే స్పెషాలిటీ వైద్యసేవలు పూర్తి ఉచితంగా లభిస్తున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్, థైరాయిడ్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ఇతర వ్యాధుల నిర్ధారణ కోసం 64 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. 172 రకాల మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భం దాల్చినది మొదలుకొని కాన్పు వరకు అవసరమయ్యే స్కానింగ్, ఇతర పరీక్షలు, మందులు అన్నీ ప్రభుత్వమే ఉచితంగా అందిచటంతో నిరుపేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, గుంటూరు

సేవలు బాగున్నాయి



గర్భం దాల్చినది మొదలుకొని ప్రతినెలా గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల్ని పొందుతున్నా. అన్ని వైద్యపరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా అందిస్తున్నారు. గైనకాలజీ డాక్టర్ ప్రతినెలా స్కానింగ్ చేసి బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన మందులు, వైద్య సలహాలు అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే దీటుగా సేవలు అందిస్తున్నారు.

– శివపార్వతి, బ్రాడీపేట, గుంటూరు

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు: మేయర్



శ్మశానవాటికలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలోని శ్మశానవాటికల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శ్రీనివాసరావుతోటలోని హిందూ శ్మశానవాటికలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శ్రీనివాసరావుతోట శ్మశానవాటికను ఎనిమిది డివిజన్లలోని సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్నారన్నారు. వాటికలో గ్రీనరీ, సంప్రదాయం ప్రకారం పెదకర్మ, గదులు, భోజన, వంటశాల, కేశ ఖండనం, స్నానపు గదులు, అస్థికలు భద్రపరుచు గదుల సౌకర్యాలతో పాటు బయట రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సంప్రదాయాల ప్రకారం పూడ్చటం, కట్టెలతో పాటు ఎలక్ట్రికల్ దహన యంత్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పార్థివ దేహాల్ని కొన్ని రోజుల పాటు భద్రపరచడానికి ఐస్ మార్చురీ గదులు, బాక్సులు, పలు దేవతామూర్తుల విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, కాండ్రుకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల రమేష్, తేలుకుంట్ల యోగేశ్వరరావు, సాధు రాజేష్, నగర పాలక సంస్థ ఈఈ సుందర రామిరెడ్డి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

84శాతం పన్ను వసూలు అభినందనీయం

2022–23 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్లు 84 శాతం చేయడం అభినందనీయమని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. వసూళ్లు పెంచడంలో కృషి చేసిన రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లను మేయర్ తన చాంబర్‌లో అభినందించారు. నగరపాలక సంస్థ పరిధిలో రూ. 146 కోట్ల బకాయిలకు గాను రూ. 115 కోట్లను రికార్డు స్థాయిలో రెవెన్యూ అధికారులు సిబ్బంది వసూలు చేయడం అభినందనీయమని తెలిపారు. ఏప్రిల్‌లో కూడా ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద బకాయిలను ఏక మొత్తంగా ముందుగానే చెల్లిస్తే ఆస్తి పన్నుపై 5% రాయితీ లభిస్తుందన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు ఎస్.ఎస్. ప్రసాద్, బాలాజీ బాష, రవికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బ్రాడీపేట 6/14లో పార్కులో రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులకు సోమవారం మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే ఆర్టీసీ కాలనీ, పొన్నూరు రోడ్డు, ఎన్‌జీఓ కాలనీ పార్కుల్ని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. బ్రాడీపేట పార్కులో ప్రహరీ, వాకింగ్ ట్రాక్, పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మార్కెట్ సెంటర్‌లోని గాంధీ పార్కును కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని, త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి వెంకట కృష్ణ, సాదు రాజేష్, ఏడీహెచ్ రామారావు, డీఈఈ రఫీక్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉత్సాహం



పోటీల్లో చెస్ ఆడుతున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో మానసిక, శారీరక ఉత్సాహంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల మైదానంలో సోమవారం డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆటల పోటీల్నినిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తిని పెంచుకుని, రాణించడం ద్వారా భావి క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్‌తో పాటు చెస్, అథ్లెటిక్స్ పోటీల్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యత సాధించడం ద్వారా తోటి క్రీడాకారులతో స్నేహపూర్వక సంబంధాల్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా క్రీడలు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల క్రీడల కమిటీ అధ్యాపకులు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, మేజర్ కుమార్ రాజా, డాక్టర్ రవి, చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే తప్పుడు కథనం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, షాలిని డెవలపర్స్ డైరెక్టర్ థామస్ నాయుడు ధ్వజం



2018లో అనుమతులు ఇచ్చిన ధ్రువపత్రాలను చూపిస్తున్న థామస్ నాయుడు

పట్నంబజారు: రాజకీయాల్లో ఉంటే వ్యాపారం చేయకూడదా ? ఉద్దేశపూర్వకంగా విషప్రచారం చేస్తున్నారు.. తప్పుడు వార్తలపై కచ్చితంగా స్పందిస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, షాలిని డెవలపర్స్ డైరెక్టర్ లక్కాకుల థామస్ నాయుడు స్పష్టం చేశారు. నిజాయతీగా వ్యాపారం చేసుకుంటూ, రాజకీయాల్లో ఉన్న తమ ప్రతిష్టకు భంగం కలిగించేలా కథనాలు రాసిన ఒక పత్రికపై పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు. అరండల్‌పేటలోని ఒక హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1996లో షాలిని డెవలపర్స్‌ను ఏర్పాటుచేసి ఎన్నో వెంచర్లు క్రయ, విక్రయాలు చేశామని, ఇప్పటివరకు కనీసం ఒక్క ఆరోపణ కూడా తమపై లేదని చెప్పారు. 2013 నుంచి ఐదు సంవత్సరాల పాటు వాదోపవాదాల అనంతరం హైకోర్టు ఆదేశాలతో 2018లో అంటే తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అధికారికంగా పట్టా పొందిన వారి నుంచి అవసరమైన అన్ని న్యాయపరమైన సలహాలు తీసుకుని, బహిరంగ పేపర్ ప్రకటన ద్వారా ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేవని రూఢీ చేసుకున్న తర్వాత 4 ఎకరాల 39 సెంట్ల స్థలాన్ని తాము కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు. సక్రమమైన పద్ధతిలో పక్కా డాక్యుమెంటేషన్‌తో రిజిస్టర్ చేయించుకున్న తమ సంస్థపై ఒక దినపత్రిక అవాస్తవాలతో కూడిన అభూత కల్పనలు అచ్చేసిందని ఆరోపించారు. సమావేశంలో కొనుగోలు చేసిన భూమి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో క్లియరెన్స్ పొందినట్లుగా ఉన్న అన్ని ఆధారాలను బహిర్గతం చేశారు. సమావేశంలో షాలిని డెవలపర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో త్వరలో అందుబాటులోకి ఈ- ఆటోలు



ఈ - ఆటోలకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో త్వరలో ఇంటింటి నుంచి వ్యర్థాల సేకరణకు ఈ–ఆటోలు అందుబాటులోకి రానున్నాయని, వాటి నిర్వహణకు కార్మికులకు శిక్షణ ఇస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం ఇన్నర్ రింగ్ రోడ్డులో ఈ–ఆటోల శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికుల ట్రయల్ రన్‌ను కమిషనర్ ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్)లో భాగంగా గుంటూరు నగరానికి 220 ఈ–ఆటోలను కేటాయించిందని తెలిపారు. కార్మికులకు త్వరగా ఆటోల నిర్వహణ, నడపడంపై పట్టు వచ్చేలా చూడాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. ఈ- ఆటోలు అందుబాటులోకి వస్తే నగరంలో సమగ్రంగా పారిశుద్ధ్య పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ భాస్కర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఎస్‌ఎస్‌లు రాంబాబు, ఆనందకుమార్, సోమశేఖర్, ఆయుబ్ ఖాన్, ఏఈ దుర్గా ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ కీర్తి చేకూరి అధికారుల్ని ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ముందుగా గత వారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 47 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్ విభాగానికి 11, ప్రజారోగ్య విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 14, ఉపాసెల్ విభాగానికి ఒకటి, అకౌంట్స్ విభాగానికి ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఆర్‌ఓలు, ఈఈలు, ఎస్‌ఎస్‌లు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: స్నేహితురాలిపై లైంగిక దాడి చేసి, అనంతరం హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన మస్తాన్ హైదరాబాద్‌లో ఉండే సమయంలో ఓ యువతితో పరిచయమైంది. అనంతరం గుంటూరు వచ్చాడు. గతనెల 23న హైదరాబాద్‌కు చెందిన మహిళను మస్తాన్ గుంటూరుకు రమ్మని పిలవడంతో వచ్చి, తిరిగి వెళ్లింది. మరలా 28న గుంటూరు వచ్చి మస్తాన్‌ను కలిసింది. ఆమెను అతడు హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేసి, హత్యాయత్నానికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఏటీఅగ్రహారంలో నివసించే ఓ మహిళ బ్రాడీపేటలోని ఓ అపార్టుమెంటులో ఇంటి పనులు చేసుకుంటుంది. ఇంటికి వెళుతున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన వేల్పుల రమేష్ వెంటపడి వేధించేవాడు. గతనెల 24న రోడ్డుపై అడ్డగించి ఇంట్లో ఎవరూ లేరని, రమ్మని బలవంతం చేశాడు. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించి ఇంటికి వెళ్లింది. దీనిపై సోమవారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వృద్ధురాలిపై వ్యక్తి దాడి

వృద్ధురాలిపై ఇంట్లో పనిచేసే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌లోని అభిరామ్ రెసిడెన్సీ అపార్టుమెంటులో అక్కినేని వెంకట రమణయ్య, సౌజన్య దంపతులు నివసిస్తున్నారు. వెంకటరమణయ్యకు పక్షవాతం రావడంతో సేవలందించేందుకు నూజివీడుకు చెందిన వెంకటేష్‌ను పనిలో పెట్టుకున్నారు. అతని తీరు నచ్చక ఆదివారం నుంచి పని మానేయాలని చెప్పారు. దీంతో వెంకటేష్ కత్తితో సౌజన్యపై దాడి చేసి మెడ, చేతులమీద గాయపరిచాడు. సౌజన్య ప్రతిఘటించి కేకలు వేయడంతో పరారయ్యాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

నాసా కాంటెస్ట్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు



నాసా కాంటెస్ట్‌లో ఎంపికైన విద్యార్థితో ఏజీఎం అంజయ్య, డీన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: అమెరికాలోని నాసా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ స్పేస్ షటిల్‌మెంట్ కాంటెస్ట్–2023లో శ్రీచైతన్య స్కూల్స్ విద్యార్థులు సత్తా చాటారని సంస్థ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య తెలిపారు. నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య సీబీఎస్‌ఈ పాఠశాలలో సోమవారం నాసా స్పేస్ షటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో బహుమతులు పొందిన విద్యార్థుల్ని ఆయన అభినందించారు. నాసా కాంటెస్ట్‌లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టుల్లో 89 భారతదేశం నుంచే ఉన్నాయని, వాటిలో 54 శ్రీచైతన్య పాఠశాలల నుంచే ఎంపికైనట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన 18 ప్రాజెక్టుల్లో ఆరు గుంటూరు జోన్ నుంచి ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని సంస్థ డైరెక్టర్ సీమ, ఏజీఎం డాక్టర్ అంజయ్యతో పాటు ప్రిన్సిపాల్స్, డీన్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

పరీక్ష కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష కేంద్రాల పేర్లు, చిరునామా తెలుపకోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ''విద్యాశాఖ నిర్లక్ష్యంతో అవస్థలు'' శీర్షికతో 'సాక్షి' సోమవారం కథనం ప్రచురించింది. విద్యాశాఖ యంత్రాంగంలో కదలిక వచ్చింది. జిల్లా వ్యాప్తంగా టెన్త్ పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసిన పాఠశాలల వద్ద కోడ్, పేరు, చిరునామా స్పష్టం తెలిసే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలని డీఈఓ పి.శైలజ చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. మార్కెట్ సెంటర్లో ఉన్న హిందూ కాలేజీ హైస్కూల్ పరీక్ష కేంద్రం చిరునామా తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడిన ఘటనపై స్పందించిన డీఈఓ ఆదేశాలతో సోమవారం ఉదయం కేంద్రాన్ని సందర్శించిన గుంటూరు ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ వివరాలు స్పష్టంగా కనిపించే విధంగా బోర్డులను మెయిన్‌గేటుతో పాటు పాఠశాల ప్రాంగణంలో దారికి ఎదురుగా ఏర్పాటు చేయించారు.

న్యూట్రిషియన్ ఫుడ్స్‌తో చక్కని ఆరోగ్యం



గుంటూరు వెస్ట్: న్యూట్రిషియన్ ఫుడ్స్‌తో చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. బ్రాడీపేటలోని జాయ్ అండ్ షైన్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆయన సోమవారం 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి ఆచారితో కలసి సందర్శించారు.ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ హోదా, డబ్బున్నా ఆరోగ్యం లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. నేడు చక్కని మైక్రో న్యూట్రిషియన్ ఫుడ్స్ అందుబాటులో ఉన్నాయని, నిపుణుల సాయంతో వాడుకోవాలని సూచించారు. జాయ్ అండ్ షైన్ వెల్‌నెస్ చీఫ్ కోచ్ జె.జ్యోతి శ్యామ్ మాట్లాడుతూ హెర్బాలైఫ్ ప్రొడక్ట్స్‌తో పాటు ఆధునిక వ్యాయామాలు కూడా చేయిస్తున్నామని చెప్పారు. అనంతరం అప్పిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎ.సతీష్, ఆర్.అనూష , బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ యానీ అమల, విజయలక్ష్మి రెడ్డి, మాధవీలతా రెడ్డి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

■ జాయ్ అండ్ షైన్ వెల్‌నెస్ కేంద్రాన్ని మేయర్ కావటి సందర్శించారు. హెర్బాలైఫ్ ప్రొడక్ట్స్, కోచింగ్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రొడక్ట్ గురించి చీఫ్ కోచ్ జె.జ్యోతీ శ్యామ్, కోచ్‌లు ఎ.సతీష్, ఆర్.అనూష వివరించారు.

జీబీఏ ఓట్ల లెక్కింపులో అవకతవకలు

- న్యాయవాది ధర్నా
- రీకౌంటింగ్ చేయాలని డిమాండ్



ప్రత్యూష

గుంటూరు లీగల్: ఇటీవల జరిగిన గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు సంబంధించిన ఓట్ల లెక్కింపులో తనకు అన్యాయం జరిగిదంటూ అభ్యర్థి పులి ప్రత్యూష సోమవారం ధర్నా చేపట్టారు. జీబీఏ కొత్త భవనంలోని ప్రెసిడెంట్ చాంబర్ ఎదుట ఆహారం తీసుకోకుండా ధర్నా చేస్తున్నట్లు ప్రకటించారు. రీకౌంటింగ్ చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఎన్నికల అధికారికి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కి, బార్ కౌన్సిల్ చైర్మన్‌కి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఆమె పేర్కొన్న వివరాల మేరకు.. 737 ఓట్లు ఆమెకు రాగా, తన ప్రత్యర్థికి 739 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మొత్తం ఓట్లు 1476గా ఎన్నికల అధికారులు చెబుతుంటే, లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు పోలైన మొత్తం ఓట్లు 1598 అని ప్రత్యూష ఆరోపిస్తుంది. ఓట్ల లెక్కింపు సమయంలోనే రీకౌంటింగ్‌కి లెటర్ ఇచ్చినప్పటికీ ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. ప్రస్తుతం ఓట్లను సీజ్ చేశారని, ఏపీ బార్ కౌన్సిల్ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటారని, అప్పటి వరకు ధర్నాను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యూష ఫిర్యాదు మేరకు ఎన్నికల అధికారులు వివరణ ఇచ్చారు. ప్రత్యూషకు 736 ఓట్లు రాగా, ఆమె ప్రత్యర్థి పర్చూరు కుమారి(నంద)కు 738 ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు రెండు చెల్లని ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. కానీ వాటిని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించగా అవి చెల్లుబాటు అయ్యే ఓట్లుగా గుర్తించినట్లు ప్రకటించారు. ఇద్దరి అభ్యర్థులకు చెరొక ఓటు యాడ్ చేయగా ప్రత్యూషకు 737, పర్చూరు కుమారికి 739 వచ్చినట్లుగా ప్రకటించారు. దీనికి సబంధించిన డేటా స్పష్టంగా ఉందని వివరించారు. ప్రత్యూష చేస్తున్న ఆరోపణలు అందుబాటులో ఉన్న మెటీరియల్‌కు విరుద్ధంగా ఉండటంతో రీకౌంటింగ్‌ను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.